నేడు సిఎం పోలవరం పర్యటన సాగేదిలా

ప్రజాశక్తి - ఏలూరు

సిఎం జగన్మోహన్‌రెడ్డి ఈ నెల ఆరో తేదీ పోలవరం ప్రాజెక్టు ప్రాంతంలో పర్యటించనున్నారు. ఆయన మంగళవారం ఉదయం 9.30కి తాడేపల్లిలోని తన నివాసం నుంచి బయల్దేరతారు. 10.20 గంటలకు పోలవరం ప్రాజెక్టు ప్రాంతంలోని హెలీప్యాడ్‌కు హెలీకాప్టర్‌లో చేరుకుంటారు. 10.30 వరకూ ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రముఖులతో మాట్లాడతారు. తర్వాత పోలవరం ప్రాజెక్టు పనుల పరిశీలనకు వెళ్తారు. 11.50కు తిరిగి అక్కడ నుంచి బయల్దేరి సమావేశ మందిరానికి చేరుకుంటారు. 12 గంటల నుంచి ఒంటి గంట వరకూ అధికారులు, ప్రజాప్రతినిధులు, నిపుణులతో పనులపై సమీక్షిస్తారు. అనంతరం ఒంటి గంటకు బయల్దేరి హెలీప్యాడ్‌కు చేరుకుంటారు. అక్కడ అరగంటసేపు స్థానిక నాయకులతో సమావేశమవుతారు. 1.40కు అక్కడ నుంచి హెలీకాప్టర్‌లో బయల్దేరి 2.30 గంటలకు తాడేపల్లిలోని తన నివాసానికి సిఎం చేరుకుంటారు.

మున్సిపల్ కార్మికుల గోడు పట్టని ప్రభుత్వం

ప్రచార జాతాలో ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి డి.నూకరాజు - జిల్లాలో సాగిన యాత్ర

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

సిఎం జగన్ ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి డి.నూకరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గతనెల 31వ తేదీన శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురంలో ప్రారంభమైన ప్రచార జాతా సోమవారం సాయంత్రం ఏలూరు చేరుకుంది. ఈ సందర్భంగా స్థానిక ఆర్ఆర్ పేట పార్కు వద్ద నిర్వహించిన సభలో నూకరాజు మాట్లాడుతూ కరోనా సమయంలో ప్రాణాలకు తెగించి సేవలందించిన మున్సిపల్ కార్మికులను 60 సంవత్సరాలు రాగానే రూపాయి కూడా చెల్లించకుండా తొలగిస్తున్నారని, గతంలో అలా తొలగిస్తే వారి పిల్లలకు అవకాశం ఇచ్చేవారని తెలిపారు. మున్సిపల్ కార్మికులకు తగినంత వేతనాలు ఇవ్వకపోయినా అమ్మఒడి, పెన్షన్లు వంటి పథకాలు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ ప్రకారం మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేయాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సాగిస్తున్న ఈ యాత్ర ఈనెల ఎనిమిదో తేదీకి విజయవాడ చేరుకుంటుందని తెలిపారు. తొమ్మిదో తేదీలోపు సమస్యలు పరిష్కరించని పక్షంలో రాష్ట్రంలోని 45 వేల మంది కార్మికులను కలుపుకుని అవసరమైతే నాలుగైదు రోజులు విజయవాడలోనే వంటావార్పు కార్యక్రమం నిర్వహించి ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.సోమయ్య మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులు చాలీచాలని వేతనాలతో అనేక ఇబ్బందులు పడుతున్నారని, సమస్యల పరిష్కారం కోసం అనేకసార్లు ప్రయత్నించినప్పటికీ పరిష్కారం లభించలేదన్నారు. అందుకే రాష్ట్రంలో ఉన్న 126 మున్సిపాలిటీలను సందర్శిస్తూ రెండు యాత్రలు జరుగుతున్నాయని, ఈ యాత్రలు ఎనిమిదో తేదీకి విజయవాడ చేరుకుని గవర్నర్‌కు, ముఖ్యమంత్రికి వినతులు ఇస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ నాయకురాలు జి.లక్ష్మి, విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ నాయకులు నాయుడు, పశ్చిమగోదావరి జిల్లా నాయకులు టి.బాబు, సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు, ఎ.జాన్‌బాబు, లావేటి కృష్ణారావు, వీరంకి సాయిబాబు, కారు దుర్గారావు పాల్గొన్నారు.



ఏలూరులో..

జంగారెడ్డిగూడెంలో..

జంగారెడ్డిగూడెం: మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారానికి ఎన్నికల సమయంలో సిఎం జగన్ ఇచ్చిన హామీలను అమలు చేయాలని, తక్షణం వారి సమస్యలు పరిష్కరించాలని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు బి.సోమయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన రాష్ట్ర ప్రచారజాతాను సోమవారం జంగారెడ్డిగూడేనికి చేరింది. ఈ యాత్రను జయప్రదం చేయాలని సోమయ్య పిలుపునిచ్చారు. సిఐటియు ఆధ్వర్యంలో ఇచ్ఛాపురంలో ప్రారంభమైన రాష్ట్ర ప్రచార జాతాకు స్థానిక మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు జాతాకు స్వాగతం పలికారు. పాత బస్టాండ్ సెంటర్ నుండి బైక్ ర్యాలీ చేస్తూ కొత్త బస్టాండ్‌కు చేరుకున్నారు. అనంతరం బి.సోమయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో మొత్తం రెండు రాష్ట్ర ప్రచార జాతాలను బయలుదేరినట్లు తెలిపారు. ట్రాఫిక్ విధానాన్ని కార్మికుల వేతనాలను గుదిబండలా పెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ జాతాలో భాగంగా సంతకాల సేకరణ చేసి రాష్ట్ర జాతా ముగిసిన అనంతరం ఆ సంతకాల సేకరణ కాపీలను గవర్నర్‌కు సమర్పిస్తామని తెలిపారు. కార్మికుల సమస్యలపై సిఎం జగన్ కమిటీ సమావేశం ఏర్పాటుచేసి వారి సమస్యల పరిష్కారానికి దృష్టి సారించాలి కోరారు. ఈ ప్రచార జాతాకు మెప్మా ఆర్‌పిలు, ఆటో వర్కర్లు సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు బాబు రంగారావు, లక్ష్మి, సిఐటియు పట్టణ అధ్యక్షులు పసుల సూర్యారావు, పట్టణ కార్యదర్శి షేక్ సుభాషిణి, మున్సిపల్ వర్కర్స్ అధ్యక్షులు బి.బాలరాజు, జిల్లా అధ్యక్షులు రేలంగి నాగరాజు, కార్యదర్శి జి.లక్ష్మణ్, వేల్పుల రాజు, శ్రీను, వినోద్ పాల్గొన్నారు.

చింతలపూడి : మున్సిపల్ కార్మికుల సమస్యలు దీర్ఘకాలికంగా అపరిష్కృతంగా ఉన్నాయని, ఎన్నికల పాదయాత్ర సందర్భంగా సిఎం జగన్ మున్సిపల్ కార్మికులకు ఇచ్చిన హామీలను నేటివరకూ అమలు చేయక కార్మికులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మున్సిపల్ కార్మిక సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు బి.సోమయ్య అన్నారు. గతనెల 31వ తేదీన ఇచ్ఛాపురంలో మొదలైన మున్సిపల్ కార్మికుల ప్రచార యాత్ర జంగారెడ్డిగూడెం మీదుగా చింతలపూడికి చేరుకుంది. ఈ సందర్భంగా మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర నాయకురాలు గార్లపాటి లక్ష్మీ మాట్లాడుతూ 2019 ఎన్నికల సందర్భంగా మున్సిపల్ కాంట్రాక్ట్ అవుట్‌సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేస్తామన్న హామీ నేటి వరకూ అమలు చేయలేదన్నారు. అనేక మున్సిపాలిటీలలో సిబ్బంది కొరతతో పనిచేస్తున్న కార్మికులపై పని భారం పెరిగిందన్నారు. సమస్యలు పరిష్కరించని పక్షంలో నిరవధిక పోరాటానికి వెనకాడబోమన్నారు. ఈ కార్యక్రమంలో వాటర్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి జి.నాగరాజు, స్వీపింగ్ విభాగం కార్యదర్శి వెలగాడి పద్మ, నాగమణి, బొచ్చా పద్మ, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్‌విఎస్.నారాయణ పాల్గొన్నారు.

కొవ్వొత్తుల ప్రదర్శనలో నాయకులు

రైలు ప్రయాణికుల భద్రతను విస్మరించిన మోడీ

ఒడిశా ప్రమాద మృతులకు సంతాపంగా కొవ్వొత్తుల ర్యాలీ

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

దేశంలో అత్యంత వేగమైన వందే భారత్ రైళ్లను గురించి గొప్పలు చెబుతున్న మోడీ ప్రభుత్వం రైల్వే ప్రయాణికుల భద్రత మాత్రం విస్మరిస్తుందని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి విమర్శించారు. సోమవారం సాయంత్రం ఏలూరు పవర్‌పేట రైల్వే స్టేషన్ వద్ద సిపిఎం నగర కమిటీ ఆధ్వర్యంలో రైలు ప్రమాద మృతులకు నివాళులర్పిస్తూ కొవ్వొత్తులతో ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సిపిఎం ఏలూరు కార్యదర్శి పి.కిషోర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ ప్రపంచంలోనే మన భారతీయ రైల్వే వ్యవస్థ చాలా పెద్దది, అలాంటి రైల్వేను బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రయివేటీకరణ చేస్తోందని విమర్శించారు. రైల్వేలో సిగ్నల్ వ్యవస్థ సక్రమంగా పని చేయకపోవడం వల్లే ఒడిశాలో భారీ ప్రమాదం జరిగిందని ప్రాథమిక విచారణలో తేలిందన్నారు. రైల్వే శాఖలో మూడున్నర లక్షల పోస్టులు ఖాళీగానున్నాయని, అయితే కేంద్ర ప్రభుత్వం భర్తీ చేయకపోవడం వల్ల, సిబ్బంది కొరత కూడా ప్రమాదాలకు కారణమవుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న రైల్వే ప్రయివేటీకరణ విధానాల వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. వందే భారత్ రైలును ఊరూరా ప్రారంభిస్తూ ప్రచారం చేసుకుంటున్న ప్రధాని మోడీ ఆ రైల్లో ప్రయాణించే ప్రజల భద్రత గురించి ఆలోచించడం లేదని విమర్శించారు. వేగవంతమైన రైళ్లను ప్రవేశపెట్టడంతో పాటు, ఆ రైళ్ల వేగాన్ని తట్టుకునే విధంగా పట్టాల ఆధునికీకరణ, సక్రమంగా పనిచేసేలా సిగ్నల్ వ్యవస్థను మెరుగుపరచడం, వాటి నిర్వహణకు అవసరమైన రైల్వే కార్మికులు, ఉద్యోగులను పూర్తిస్థాయిలో నియమించడం వంటి చర్యలు చేపట్టాలని కోరారు. రైలు ప్రమాదాలపై సమగ్ర దర్యాప్తు జరిపి భవిష్యత్తులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై యుద్ధ ప్రాతిపదికన రక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు రామకృష్ణ, నగర కమిటీ సభ్యులు విఎన్.ప్రసాద్, నాయకులు మంచి ర్యాల ఇస్సాక్, ఏసుబాబు, సురేంద్ర, రుక్మిణమ్మ, స్పందన, నారాయణ, సత్యనారాయణ పాల్గొన్నారు.

ధర్నా చేస్తున్న దళితులు, నాయకులు

నేడు జగన్ పర్యటనకు భారీ బందోబస్తు

ప్రజాశక్తి - పోలవరం

సిఎం జగన్ మంగళవారం పోలవరం ప్రాజెక్టు పరిశీలనకు రానున్న నేపథ్యంలో రాష్ట్రంలో నలుమూలల నుండి భారీగా పోలీసు బలగాలను పోలవరం ప్రాజెక్టు ప్రాంతానికి తరలించారు. ముఖ్యమంత్రి భద్రత ఏర్పాట్ల కోసం వెయ్యి మంది పోలీస్ బలగాలను వినియోగిస్తున్నట్లు అధికారులు తెలిపారు. విజయనగరం, శ్రీకాకుళం, విశాఖపట్నం, తూర్పుగోదావరి, ఏలూరు పశ్చిమగోదావరి, కృష్ణా జిల్లాల నుండి పోలీస్ బలగాలు ఆర్టిసి బస్సుల్లో సోమవారం ఉదయానికే పోలవరం ప్రాజెక్టుకు చేరుకున్నాయి. వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో పోలవరం ప్రాజెక్టు కార్యాలయం వద్ద మెడికల్ క్యాంపును ఇప్పటికే ఏర్పాటు చేశారు. పోలవరం ఎంఎల్ఎ తెల్లం బాలరాజు, ఎంపిపి సుంకర వెంకటరెడ్డి, వైసిపి మండల కన్వీనర్ బుగ్గా మురళీకృష్ణ ఇతర నాయకులు ముఖ్యమంత్రి పర్యటించనున్న ప్రాంతాలను పరిశీలించారు. జెసి లావణ్యవేణి, పోలీస్ అధికారులు, ఇంజనీరింగ్ సిబ్బంది హెలీప్యాడ్ ప్రాంతాలను పరిశీలించారు.

రెజ్లర్లకు మద్దతుగా నిరసన

ప్రజాశక్తి - ఏలూరు

ఢిల్లీలో మహిళా రెజ్లర్లు ఆందోళనకు మద్దతుగా భారత్ బచావో ఆధ్వర్యంలో సిపిఎం, సిపిఐ, కాంగ్రెస్, బహుజన సేన తదితర పార్టీలు ఏలూరు పాత బస్టాండ్ సమీపంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టాయి. ఈ సందర్భంగా భారత్ బచావో జిల్లా అధ్యక్షులు గుబ్బల నాగేశ్వరరావు, సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి, ఏలూరు కార్యదర్శి పళ్లెం కిషోర్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు రాజనాల రామ్మోహన్‌రావు మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి కార్పొరేట్ సంస్థలకు ప్రజాసంపదను దోచిపెడుతుందని విమర్శించారు ప్రజల సమస్యలను పట్టించుకోవడం లేదన్నారు. దళితులు మహిళలపై, మైనార్టీలపై దాడులు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. దేశ ప్రతిష్ట, గౌరవాన్ని ప్రపంచంలో నిలుపుతున్న మహిళ క్రీడాకారులు పట్ల కూడా ఉత్తరప్రదేశ్ బిజెపి ఎంపీ బ్రిజ్‌భూషణ్‌సింగ్ వంటి కామాందుల్లా ప్రవర్తిస్తుంటే వారిపై ఎలాంటి చర్య తీసుకోవడం లేదని విమర్శించారు. దేశంలో రైతు, కార్మిక సంఘాలు, ప్రతిపక్ష పార్టీలు, అన్ని రకాల క్రీడాకారులు, ఫిలిం యాక్టర్లు, మేధావులు అందరూ రెజ్లర్లకు మద్దతు తెలుపుతుంటే బిజెపి ప్రభుత్వం మాత్రం కామాంధులకు కొమ్ముకాయడం సిగ్గుచేటన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు రామకృష్ణ, నాయకులు ఏసుబాబు, మావూరి శ్రీనివాసరావు, బహుజన్ సేవా జిల్లా అధ్యక్షులు మత్తే బాబి, సిపిఐ నాయకురాలు కె.బేబి, కాంగ్రెస్ పార్టీ నాయకులు సేవాదళ్ సుబ్బారావు చంద్రశేఖర్ పాల్గొన్నారు.

భీమడోలు తహశీల్దారుగా ఇందిరాగాంధీ

ప్రజాశక్తి - భీమడోలు



భీమడోలు తహశీల్దారుగా ఎం.ఇందిరాగాంధీ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకూ ఇక్కడ ఇన్‌ఛార్జి తహశీల్దార్‌గా పనిచేసిన షేక్ షంషుద్దీన్ ఆమెకు బాధ్యతలు అప్పగించారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన తహశీల్దార్‌ను కె.శంకర్ ఆధ్వర్యంలో విఆర్ఒ, విఆర్ఎల సంఘాలు, రేషన్ డీలర్ల సంఘంతో పాటు సిఎస్‌డిటి ఎ.మాధవరావు, ఆర్ఐ కిరణ్‌కుమారి, కార్యాలయ సిబ్బంది అభినందించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు, తోటి అధికారుల సహకారంతో మండల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ప్రజలకు ఏదైనా సమస్య ఎదురైతే తమ దృష్టికి తేవాలని కోరారు.

అనారోగ్యంతో పెయ్యేరు విఆర్ఒ మృతి

ముదినేపల్లి : మండలంలోని పెయ్యేరు గ్రామ విఆర్ఒ అడవి దేవేంద్రరావు(58) అనారోగ్యంతో మృతి చెందారు. ఈయన గత కొంతకాలంగా ఆనారోగ్యంతో బాధపడుతూ విజయవాడలోని ఆయుష్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ తరుణంలో సోమవారం తెల్లవారుజామున పరిస్థితి విషమించి మృతిచెందారు. ఆయనకు భార్య, కుమార్తె ఉన్నారు. దేవేంద్రరావు మరణవార్త తెలుసుకున్న తహశీల్దార్ కె.శ్రీనివాస్, ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ, ఎంఆర్ఐ పి.శివకుమార్ మండలంలోని వివిధ గ్రామాల విఆర్ఒలు, విఆర్ఎలు, పెయ్యేరు సర్పంచి అల్లు సుశీల, ఉపసర్పంచి దివి సతీష్, వైసిపి నాయకులు జాస్తి రాజేంద్రప్రాద్, రాచూరి కుమార్ బి.శ్రీనివాసరావు, వైసిపి, టిడిఎ నాయకులు, ప్రజాప్రతినిధులు దేవేంద్రరావు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలిపారు. మండలంలోని కోడూరు, చినపాలపర్రు, పెయ్యేరు గ్రామాల విఆర్‌ఒగా పని చేశారు. ఇటీవల ఆయన ముసునూరు బదిలీ అయ్యారు. ఆనారోగ్య కారణాలు వల్ల ఆయన బాధ్యతలు చేపట్టలేదు. దీంతో దీర్ఘకాలంగా ఆయన సెలవులో ఉన్నారు.

ఆటో డ్రైవర్లందరికీ వాహన మిత్ర వర్తింపజేయాలి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ధర్నా చేస్తున్న నాయకులు

వాహన మిత్ర పథకాన్ని ఆటో డ్రైవర్లు అందరికీ వర్తింపచేయాలని, పెంచిన త్రైమాసిక రహదారి పన్నును ఉపసంహరించుకోవాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్, ఎపి ఆటో, ట్రాలీ డ్రైవర్స్ యూనియన్ ఏలూరు జిల్లా కమిటీ ప్రధాన కార్యదర్శి జె.గోపి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఏలూరు కలెక్టరేట్ వద్ద జరిగిన ధర్నాలో వారు మాట్లాడారు. ప్రభుత్వాలు ఉపాధి అవకాశాలు కల్పించకపోయినా తమ స్వయంశక్తితో ప్రజలకు సేవ చేస్తూ, జీవనం సాగిస్తున్న రవాణారంగ కార్మికులకు ప్రభుత్వం సంక్షేమ చర్యలు చేపట్టడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రవాణారంగ కార్మికులకు కేరళ తరహా సమగ్ర సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ట్రాన్స్‌పోర్ట్ వాహనాలకు పెంచిన త్రైమాసిక రహదారి పన్నును ఉపసంహరించుకోవాలని, ఇప్పటికే పొరుగు రాష్ట్రాలతో పోల్చుకుంటే 50శాతం ఎక్కువగా రహదారి పన్నులను మన రాష్ట్రం వసూలు చేస్తుందన్నారు. పెట్రోల్, డీజిల్ ధరలు సైతం పొరుగు రాష్ట్రాల కంటే దాదాపు ఆరు రూపాయల వరకూ అధిక ధరలు మన రాష్ట్రంలో ఉన్నాయని, దీని ఫలితంగా ఇతర రాష్ట్రాల ట్రాన్స్‌పోర్ట్ ఆపరేటర్లతో మన రాష్ట్ర ట్రాన్స్‌పోర్ట్ వాహనదారులు పోటీలో నిలువలేకపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రీన్ టాక్స్ పేరుతో లారీలకు దాదాపుగా 20 వేల వరకూ జరిమానాలు విధించడం దారుణమన్నారు. ప్రతిఏటా బీమా కంపెనీలు 20 శాతం ప్రీమియం పెంచుకునేలా కేంద్ర ప్రభుత్వం వెసులుబాటు కల్పించడం వాహనదారులకు పెనుభారంగా తయారైందని విమర్శించారు. రాష్ట్రంలో రహదారుల మరమ్మతుల నిమిత్తం లీటరుకు రూపాయి చొప్పున పన్ను వసూలు చేస్తున్న రాష్ట్రప్రభుత్వం, రహదారుల మరమ్మతుల విషయాన్ని మరిచిపోయిందని విమర్శించారు. స్వయం ఉపాధి మార్గంగా ఆటోలను కొనుగోలు చేసి జీవనం సాగిస్తున్న ఆటో డ్రైవర్లపై ఇ-చలానాలతో ప్రభుత్వం వారి ఆదాయాన్ని కొల్లగొడుతుందని, తక్షణం ఇ-చలానాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. గతంలో ఆటోలు కొనుగోలు చేసేందుకు ఎస్‌సి, ఎస్‌టి, బిసి సబ్‌ప్లాన్ నిధులను బ్యాంకుల ద్వారా సబ్సిడీ రుణాలు అందించే వారని, నేడు వాటిని ఎత్తివేయడంతో ప్రయివేటు ఫైనాన్షియర్ల దోపిడీకి బలి అవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఆటో డ్రైవర్లకు షెల్టర్‌తో కూడిన పార్కింగ్‌స్టాండ్లను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాకు బుద్ధ నాగసూరిబాబు, చక్రాల అమర్ కుమార్, ఎ.జాన్‌బాబు, ఎమ్‌డి చాన్‌బాషా నాయకత్వం వహించారు.

ఆక్వా చెరువుల అక్రమ తవ్వకాలు ఆపాలని ధర్నా

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

చెరువుల అక్రమ తవ్వకాలు నిలుపుదల చేసి మండవల్లి మండలం కానుకొల్లు దళితపేటను కాపాడాలంటూ సిపిఎం, ఎపి రైతు సంఘం, దళిత సంఘాల ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద సోమవారం పెద్దఎత్తున ధర్నా నిర్వహించారు. ఆక్వా చెరువుల అక్రమ తవ్వకాలు ఆపాలంటూ పెద్దఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ప్రసాద్, ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, మాల మహాసేన జాతీయ కార్యదర్శి పళ్లెం ఏడుకొండలు మాట్లాడారు. అక్రమంగా ఆక్వా చెరువులు తవ్వుతున్నా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం దారుణమని విమర్శించారు. మండవల్లి మండలం, కానుకొల్లు దళితపేట కాలనీని అనుకుని ఉన్న పొలాలను రొయ్యలు, చేపల చెరువులుగా ఏ విధమైన అనుమతులు పొందకుండా తవ్వుతున్నారని చెప్పారు. ప్రజాదర్బారులో ఫిర్యాదు చేసినా అధికారులు ఎలాంటి చర్యలూ తీసుకోలేదన్నారు. ఆక్వా చెరువుల అక్రమ తవ్వకం వల్ల పక్కన ఉన్న ఒక్క తాగునీటి బావి పాడైపోతే పేదలు, దళితులు తీవ్ర ఇబ్బందులు పడతారని ఆందోళన వ్యక్తం చేశారు. ఆక్వా చెరువులు తవ్వుతున్న పొలాల మీదుగా గెయిల్ గ్యాస్ పైప్ లైన్ ఉందని, అది పగిలి గ్యాస్ లీక్ అయితే పెద్ద ప్రమాదం జరుగుతుందన్నారు. రాజకీయ నేతల అండదండలతో విచ్చలవిడిగా ఆక్వా చెరువుల తవ్వకాలు జరుగుతున్నాయని చెప్పారు. దళితపేటను ఆనుకుని ఆ గ్రామ ఎంపిటిసి భర్త తవ్వుతున్న ఆక్వా చెరువుల అక్రమ తవ్వకాలపై సమగ్ర విచాణ చేసి చెరువుల తవ్వకాలు ఆపి దళితులకు, పేదలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. వ్యవసాయ కార్మికులు, కౌలు రైతులు ఉపాధి కోల్పోతున్నారన్నారు. మాల మహాసేన జాతీయ అధ్యక్షులు అలగా రవికుమార్ దళితుల పోరాటానికి మద్దతు తెలిపారు. అనంతరం స్పందన కార్యక్రమంలో డిఆర్ఒ మూర్తికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ, సిఐటియు నాయకులు రాయగిరి రాము, ఆక్వా చెరువుల తవ్వకాల వ్యతిరేక పోరాట కమిటీ నాయకులు యల్లమెల్లి మరియరాజు, కోసూరి మాణిక్యాలరావు, విష్ణుమూర్తుల రాంబాబు, పి.జోసెఫ్ తంబి, జువ్వనపూడి మరియమ్మ, యల్లమిల్లి కళ్యాణి, దొండపాటి జాస్మిన్, యల్లమిల్లి సునీత, మేరుగు రాంబాబు, కంతేటి షిమ్మోను పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

జిల్లావ్యాప్తంగా పర్యావరణ పరిరక్షణ దినోత్సవం

ప్రజాశక్తి - విలేకరులు

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని పలువురు వక్తలు పేర్కొన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా సోమవారం జిల్లావ్యాప్తంగా పర్యావరణ పరిరక్షణపై అవగాహన ర్యాలీలు, సభలు, సమావేశాలు నిర్వహించారు. విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు.

ఏలూరులో మొక్కనాటుతున్న కలెక్టర్

ఏలూరు అర్బన్ : పర్యావరణాన్ని కాపాడుకోవడం ప్రతిఒక్కరి బాధ్యత అని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ వెల్లడించారు. సోమవారం అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవం సందర్భంగా కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరం వద్ద అటవీశాఖ ఆధ్వర్యంలో కలెక్టర్ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం కాలుష్యాన్ని నివారించడానికి ప్రతిఒక్కరూ ఇంటి పరిసరాల్లో మొక్కలు నాటాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎవిఎన్ఎస్.మూర్తి, డిఎఫ్ఒ ఎం.హిమశైలజ, ఎఫ్ఒఆర్ఎస్ఎస్ కె.ఫిరోజ్, టి.శ్రీసాయి, ప్రసాద్ పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరం వద్ద ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాల నెట్ క్యాప్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గో-ఎలక్ట్రిక్ గో- గ్రీన్ క్యాంపెయిన్‌ను కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యుత్ ద్విచక్ర వహనాలు, ఆటోలను కలెక్టర్ పరిశీలించి వాటి పనితీరును, ధరను తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నెట్ క్యాప్ కో-ఆర్డినేటర్ డివి.ప్రసాద్ మాట్లాడుతూ ఈ వాహన ప్రధాన ఉద్దేశం కాలుష్య నియంత్రణ అని అన్నారు. తక్కువ రవాణా ఖర్చుతో ప్రయాణం చేయొచ్చని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులు, నెట్ క్యాప్ ద్వారా 48 నెలల సులభ వాయిదాలతో తొమ్మిది శాతం వడ్డీతో వాహనాన్ని పొందొచ్చని తెలిపారు. వాహనం కావాల్సినవారు 9553486987 నెంబర్‌ను సంప్రదించి పూర్తి వివరాలు తెలుసుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎవిఎస్ఎన్ మూర్తి, జెడ్పి సిఇఒ రవికుమార్, టివిఎస్ కంపెనీ మేనేజరు ప్రసాద్, హీరో కంపెనీ మేనేజరు రమేష్, ఎథర్ కంపెనీ మేనేజర్ ప్రసాద్, మహీంద్ర కంపెనీ మేనేజరు దిలీప్, నెట్ క్యాప్ సిబ్బంది పాల్గొన్నారు.

ఏలూరు: ప్రపంచ మానవాళి పరిరక్షణకు పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన అవసరం అందరిమీద ఉందని పలువురు వక్తలు పేర్కొన్నారు. పవర్‌పేటలోని అన్నే భవనంలో పర్యావరణ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా జరిగిన సభకు ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం కమిటీ సభ్యురాలు జి.శారద స్వాగతం పలికారు. సభకు సులభ గణిత, తెలుగు భాష ఉద్యమ నాయకులు వై.ఆనంద నాయుడు అధ్యక్షత వహించారు. అనంతరం ఆనందనాయుడు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు అందరూ మొక్కలు నాటాలని, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలన్నారు. ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం కార్యదర్శి గుడిపాటి నరసింహారావు మాట్లాడుతూ పర్యావరణాన్ని రక్షించుకోకపోతే గాలి, నీరు, వాతావరణం చెడిపోతుందని వాటి ప్రభావాలను సోదాహరణగా వివరించారు. అనంతరం విజిఎన్‌విఆర్.కృష్ణారావు మాట్లాడుతూ విజ్ఞాన కేంద్రం కాలుష్య నియంత్రణ మండలి, హేలాపురి చిల్డ్రన్స్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణ కాలుష్య నివారణ అనే అంశంపై విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. తొలుత కంప్యూటర్ శిక్షణ కేంద్రంలో 22వ బ్యాచ్‌లో శిక్షణపొందిన వారిలో 14 మందికి అతిథుల ద్వారా సర్టిఫికెట్లు ప్రధానం చేశారు. అనంతరం డ్రాయింగ్ పోటీల విజేతలకు బహుమతులు, కాలుష్య నియంత్రణ మండలి అందించిన టీ షర్టులు, విజ్ఞాన కేంద్రం ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో విజ్ఞాన కేంద్రం కమిటీ సభ్యులు విజిఎంవిఆర్‌కృష్ణారావు, ఎన్.గంగాభవాని, కె.శ్రావణి, ఎం.లక్ష్మి, టి.తులసి పాల్గొన్నారు.

ఏలూరుటౌన్: ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని డిఎంహెచ్ఒ డాక్టర్ డి.ఆశ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా డిఎంహెచ్ఒ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడలని, ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని, ప్లాస్టిక్ లేని సమాజాన్ని నిర్మించాలని, ప్రతి ఇంటికి ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని, కరెంట్ వినియోగాన్ని సాధ్యమైనంత వరకూ తగ్గించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టిబి కంట్రోల్ అధికారి డాక్టర్ జి.రత్నకుమారి, ఇన్‌ఛార్జ్ ఎన్‌సిడి ప్రొగ్రాం ఆఫీసర్ డాక్టర్ ప్రియాంక, డిఎంహెచ్ఒ కార్యాలయ సిబ్బంది, ఎంఎల్‌హెచ్‌పిలు, స్వచ్ఛంద సంస్థలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు

పెదవేగి: స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ, ఫారెస్ట్ సిబ్బంది, ఎంపిడిఒ ఆధ్వర్యంలో మేరీ లైఫ్‌స్టైల్ కార్యక్రమంలో భాగంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవంపై సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ రాజ్‌మనోజ్ మాట్లాడారు. ప్రజలు బాధ్యతగా మొక్కలు పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ఎం.నాగరాజు, ఎంపిడిఒ జి.రాజ్‌మనోజ్, ఏలూరు ఫారెస్ట్ డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ కెవి.రామలింగచార్యులు, స్థానిక ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ ఎమ్‌డి మహబూబ్, సిబ్బంది పాల్గొన్నారు.

ముసునూరు : ప్రతిఒక్కరూ ఏడాదికి ఒక మొక్క నాటాలని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ కె.ధనలక్ష్మి అన్నారు. సోమవారం ముసునూరులో అంగన్‌వాడి సిబ్బంది, సూపర్‌వైజర్లు కె.ధనలక్ష్మి, జె.రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో ప్రపంచపర్యావరణ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించి, అంగన్‌వాడీ కేంద్రాల వద్ద మొక్కలు నాటారు.

నూజివీడు రూరల్ : పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని సబ్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా నూజివీడు పట్టణంలోని గుర్రంగేటు వద్ద మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వాతావరణంలో కాలుష్య కారకాలు పెరిగిపోవడం, చెట్లను విచ్చలవిడిగా నరకడం వల్ల పర్యావరణానికి ముప్పు వాటిల్లుతుందన్నారు.

ఏలూరు అర్బన్ : జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఇన్‌ఛార్జి ఛైర్మన్, మొదటి అదనపు జిల్లా జడ్జి జి.రామగోపాల్ ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా జిల్లా కోర్టు ప్రాంగణంలో మొక్కల నాటారు. ఈ కార్యక్రమంలో రెండో అదనపు జిల్లా జడ్జి పి.మంగాకుమారి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఇన్‌ఛార్జి కార్యదర్శి బుల్లి కృష్ణ, పర్మినెంట్ లోక్ అదాలత్ ఛైర్‌పర్సన్ మేరీ గ్రేస్‌కుమారి, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ అభినేని విజయ్ కుమార్ పాల్గొన్నారు.

భీమడోలు : పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటడంతో పాటు ఆరోగ్య పరిరక్షణకు సైకిల్ తొక్కడం అలవాటుగా చేసుకోవాలని, భీమడోలు శ్రీ వెంకటేశ్వర జూనియర్, డిగ్రీ కళాశాల ప్రధాన ఆచార్యులు వంగా నాగేశ్వరరావు, బొమ్ము రవికుమార్ కోరారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని కళాశాల ఆవరణలో జూనియర్, డిగ్రీ కళాశాలలకు చెందిన ఎన్ఎస్ఎస్ విభాగం, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా స్థాయిలో ఎంపిక చేసిన శిక్షణా కేంద్రాల్లో ఒకటైన భీమడోలు శ్రీ వెంకటేశ్వర కళాశాలలో శిక్షణ పొందుతున్న పలువురు యువత, శిక్షణా కేంద్రం స్పోక్స్ పర్సన్ జె.రాము, కో-ఆర్డినేటర్ సురేష్ మొక్కలు నాటే కార్యక్రమాన్ని వేర్వేరుగా చేపట్టారు. భీమడోలు పురవీధుల్లో పర్యావరణ పరిరక్షణ ప్లకార్డులు ధరించి నినాదాలు చేస్తూ సైకిల్ ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ విభాగం కో-ఆర్డినేటర్ ఆర్.ధనరాజు, జి.నాగరాజు పాల్గొన్నారు.

మండవల్లి : పర్యావరణ పరిరక్షణకు, ప్లాస్టిక్ నియంత్రణకు ప్రజలు ముందుకు వచ్చి ఉద్యమించాల్సిన అవసరం ఎంతైనా ఉందని సుధామ ఫౌండేషన్ అధినేత ప్రొఫెసర్ సుధాబత్తుల విజయ్‌కుమార్ స్పష్టం చేశారు. ప్రపంచ పర్యావరణ పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా పరిషత్ హైస్కూల్, సుధామ ఫౌండేషన్, ప్రజాస్వామ్య క్యవేదిక ఆధ్వర్యంలో సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముందుగా పర్యావరణ పరిరక్షణపై ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక సభ్యులు ఎల్ఎస్.భాస్కరరావు టి.అప్పారావు, ప్రధానోపాధ్యాయులు జి.వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు నాగేశ్వరరావు, వెంకటేశ్వరరావు, దుర్గమ్మ, శ్రీదేవి, విద్యార్థులు భరత్ సాయి, రాహుల్, నవదీపిక, నవ్య, నాగసాయి పాల్గొన్నారు.

ఉంగుటూరు : నారాయణపురం, శ్రీఅరవింద శతయంతి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మొక్కలు నాటారు. నారాయణపురం, చేబ్రోలులో ర్యాలీ, మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్, ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ గుమ్మడి నిర్మలజ్యోతి, ఐక్యూఎసి కోఆర్డినేటర్ కొండా రవి, గణిత శాస్త్ర అధ్యాపకులు డాక్టర్ పి.బాబూరావు, రాజనీతి శాస్త్ర అధ్యాపకులు ఉమాశంకర్ పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆటల పోటీలు

ప్రజాశక్తి - ముదినేపల్లి

ముదినేపల్లి శాఖ గ్రంథాలయంలో గత నెల 8వ తేదీ నుంచి కొనసాగుతున్న వేసవి విజ్ఞాన శిబిరం సోమవారంతో 29వ రోజుకు చేరింది. సోమవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు మొక్కలు వాటి ప్రాముఖ్యత గురించి వివరించారు. అనంతరం విద్యార్థులతో పలు రకాల ఆటలు ఆడించినట్లు గ్రంథాలయాధికారిణి ఎం.శ్రీదేవి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంగ్లీష్ మాస్టార్ బాబూరావు పాల్గొన్నారు.

మండవల్లి : విద్యార్థుల్లో మనోధైర్యం పెంపుదలకు శరీర దృఢత్వానికి యోగా సాధన ఎంతగానో దోహదపడుతుందని గ్రంథాలయ నిర్వాహకురాలు షేక్ పరివిన చెప్పారు. గ్రంథాలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా సోమవారం యోగా సాధనపై ఆమె విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లల ఎదుగుదలకు పౌష్టికాహారంతో పాటు వ్యక్తిగత వ్యాయామం కూడా ఎంతో అవసరమన్నారు. యోగాను దినచర్యలో అత్యవసర భాగంగా చేర్చుకుని సాధన చేయాలన్నారు. యోగా వల్ల ఏకాగ్రత, పట్టుదల, చెడు వ్యసనాలపై నియంత్రణ, కార్యాచరణపై పట్టుదల పెరుగుతుందని తెలిపారు. విద్యార్థులు చిన్నతనం నుంచే యోగాపై అవగాహన పెంచుకోవాలన్నారు.



ఎన్‌టి.స్వామిని సత్కరిస్తున్న జెడ్‌పిటిసి సభ్యులు సూరిబాబు, సిబ్బంది

ఎన్‌టి.స్వామి సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - టి.నరసాపురం

మండలంలో ఇఒపిఆర్‌డి, ఇన్‌ఛార్జి ఎంపిడిఒగా పనిచేసిన ఎన్‌టి.స్వామి సేవలు అభినందనీయమని జెడ్‌పిటిసి సభ్యులు సామంతపూడి బాల సూర్యనారాయణ రాజు (సూరిబాబు) అన్నారు. మండలంలో ఎంపిడిఒగా పనిచేసిన ఆయన బదిలీ కావడంతో సోమవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఆయా పంచాయతీల కార్యదర్శులు, సిబ్బంది ఎన్‌టి.స్వామికి ఆత్మీయ అభినందన సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న జెడ్‌పిటిసి సభ్యులు సూరిబాబు ఆయనను శాలువాకప్పి సన్మానించారు. ఈ సందర్భంగా సూరిబాబు మాట్లాడుతూ ఎన్‌టి.స్వామి తన ఉద్యోగ బాధ్యతలు చక్కగా నిర్వర్తించారన్నారు. ఆయన సమయానికి ముందు విధులకు వచ్చేవారని, ప్రభుత్వ పథకాల అమలు విషయంలో ముందుండేవారని ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి డి.లక్ష్మి, కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

'స్పందన' ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలి

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

నూజివీడు సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం సబ్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనిలో భాగంగా ఆయన డివిజన్‌లోని పలు గ్రామాల నుంచి వచ్చిన ప్రజల వద్ద నుంచి అర్జీలను స్వీకరించారు. స్పందన అర్జీలను గడువులోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పలు శాఖలకు చెందిన డివిజన్ స్థాయి అధికారులు పాల్గొన్నారు.

చేవూరులో భారీ అన్నసమారాధన

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలోని చేవూరు శ్రీలక్ష్మీనారాయణ స్వామివారి దేవస్థానంలో సోమవారం భారీ అన్న సమారాధన నిర్వహించారు. స్వామివారి కళ్యాణ మహోత్సవాల ముగింపును పురష్కరించుకుని నిర్వహించిన అన్న సమారాధనను ఎంఎల్‌ఎ తనయులు దూలం వినయ్‌కుమార్, ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ ప్రారంభించారు. తొలుత వినయ్‌కుమార్ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ ఎం.ఏసుబాబు, గ్రామ సర్పంచి వల్లభనేని లక్ష్మి, ఆలయ ఛైర్మన్ వల్లభనేని సంపూర్ణ, సొసైటీ ఛైర్మన్ వల్లభనేని సుబ్బారావు, వైస్ ఎంపిపి సిహెచ్.సునీత, వైసిపి నేత, గ్రామ ప్రముఖులు వల్లభనేని వెంకట్రావు, ఉపసర్పంచి బాపూజీ, ఆలయ కార్యనిర్వాహణాధికారి శింగనపల్లి శ్రీనివాసరావు, వైసిపి నాయకులు వల్లభనేని వెంకటేశ్వరరావు, రాచూరి కుమార్, దివి సతీష్, బి.ఆంజనేయులు పాల్గొన్నారు.

వధూవరులకు పర్వతనేని గంగాధర్ శుభాకాంక్షలు

ప్రజాశక్తి - చాట్రాయి

మండలంలోని గుడిపాడు గ్రామానికి చెందిన పెనుకుదురు డేవిడ్ రాజు (నాగేశ్వరరావు), ఎలిజిబెత్(పద్మ) దంపతుల కుమారుడు ప్రశాంత్, చాందిని వివాహ వేడుకకు టిడిపి నూజివీడు నియోజకవర్గ నాయకులు పర్వతనేని గంగాధర్ సోమవారం హాజరై వధూవరులను ఆశీర్వదించారు. ఆయనతో పాటు టిడిపి జిల్లా పార్లమెంట్ అధికార ప్రతినిధి మందపాటి బసవ రెడ్డి, నోబుల్ రెడ్డి, తుమ్మగూడెం గ్రామ పార్టీ అధ్యక్షులు మందలపు రాజా, చల్లగుళ్ల శేఖర్, కంచర్ల హనుమంతరావు, కొల్లి నరసింహారావు, పెనుకుదిరి దుర్గారావు, చల్లగుళ్ల వీరరాఘవయ్య, చల్లగుళ్ల మోహన్‌రావు, జాస్తి నరసింహారావు, చల్లగుళ్ల లింగారావు పాల్గొన్నారు.

వారధి ఆధ్వర్యాన సైకిళ్ల పంపిణీ

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

దాతల సహకారంతో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ఇద్దరు విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ చేశామని వారధి ట్రస్ట్ వ్యవస్థాపకులు వలవల తాతాజీ తెలిపారు. సోమవారం దాతలు కొండూరి అంజేశ్వరరావు, రత్నావతి దంపతుల వితరణతో అందించిన రెండు సైకిళ్లను స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల(బాలురు)లో ఎనిమిదో తరగతి చదువుతున్న వాకడుండి లక్ష్మీ కారుణ్య, తొమ్మిదో తరగతి చదువుతున్న దొడ్డి యశశ్రీకి అందించారు. ఈ సందర్భంగా వలవల తాతాజీ మాట్లడుతూ పాఠశాలకు ప్రయాణ సౌకర్యం లేకపోవడం వల్ల బాలికల చదువుకు ఆటంకం కలగకుండా ఉండాలనే ఉద్దేశంతో సైకిళ్లు పంపిణీ చెసి ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పరిమి సత్తిపండు, 17వ వార్డు కౌన్సిలర్ నంబూరి రామచంద్రరాజు, బిజెపి జిల్లా ఉపాధ్యక్షురాలు పీసుపాటి రామలక్ష్మి, సామాజికవేత్త కెఎల్‌ఎన్.ధనకుమార్, మద్దిపాటి శ్రీను పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి - ముదినేపల్లి

వణుదుర్రు గ్రామంలో రేషన్ సరఫరాలో సమస్యలు పరిష్కరించాలంటూ వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి చిన్నం మాధవ కోరారు. సోమవారం ఆయన వినతిని తహాశీల్దార్ కె.శ్రీనివాస్‌కు ఆయన కార్యాలయంలో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా మాధవ మాట్లాడుతూ గ్రామస్తులకు బియ్యం, పంచదార ఇస్తున్నారుగానీ కందిపప్పు ఇవ్వడం లేదన్నారు. వేలిముద్రలు పడని వృద్ధులకు రేషన్ ఇవ్వడం లేదన్నారు. మిషన్‌కి సిగ్నల్ సరిగా అందడంలేదని రేషన్ నిలిపివేస్తున్నారని, సిగ్నల్ పడిన తర్వాత కొంత మందికి ఇచ్చి ఆపేస్తున్నారన్నారు. సన్న బియ్యం ఇస్తామన్న ప్రభుత్వం ఆ హామీని విస్మరించిందన్నారు.

నేరాలు - ఘోరాలు

రేషన్ దుకాణాల్లో విజిలెన్స్ దాడులు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మండలంలోని పలు రేషన్ దుకాణాలపై సోమవారం విజిలెన్స్ అధికారులు ఆకస్మిక దాడులు చేశారు. పాలచర్ల రాజవరం గ్రామంలోని షాపు నెంబర్-4, జీలుగుమిల్లిలోని షాప్ నెంబర్-1లలో దాడులు చేసినట్లు విజిలెన్స్ ఎస్‌ఐ రంజిత్ కుమార్ తెలిపారు. ఈ దాడుల్లో భాగంగా స్టాక్ రిజిస్టర్‌లో బియ్యం, కందిపప్పు, పంచదారలో తేడాలు గుర్తించినట్లు ఆయన తెలిపారు. రెండు దుకాణాలు, ఒక రేషన్ పంపిణీ వాహనంపై కూడా 6ఎ కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. ఈ దాడుల్లో ఎఒ సురేష్, సివిల్ సప్లై డిటి సురేంద్ర, విఆర్ఒ రామతులసి, మాధురి, విఆర్‌ఎ షరీఫ్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

మండవల్లి జెడ్‌పి హైస్కూల్లో క్రమశిక్షణతో కూడిన విద్య

ప్రధానోపాధ్యాయులు జి.వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి - మండవల్లి

క్రమశిక్షణతో కూడిన విద్యాభివృద్ధులు నేర్పడం ద్వారానే తమ విద్యార్థులు అధిక సంఖ్యలో మంచి ఉత్తీర్ణత సాధించడంతో పాటు జిల్లాలోనే తృతీయ స్థానం సాధించాగలిగామని మండవల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి.వెంకటేశ్వర్లు చెప్పారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆయన సోమవారం ప్రజాశక్తితో మాట్లాడుతూ విద్యార్థుల్లో ఉన్న నాడిని పట్టుదలను తెలుసుకొని తగు అనుగుణంగా విద్యా బోధన చేయడం ద్వారా చల్లేటి యువసాయి ప్రదీప్ 585 మార్కులు సాధించి కైకలూరు నియోజకవర్గం లోనే ప్రథమ స్థానంతో పాటు ట్రిపుల్ ఐటీ సీటు కూడా సంపాదించగలిగాడని చెప్పారు. విద్యార్థి విద్యలో ఎదుగుదలను దృష్టిలో ఉంచుకొని విద్యార్థులను దత్తత తీసుకొని వారు హాజరవుతున్న విధానాన్ని పరిశీలించి వారి చదువుల పట్ల ప్రత్యేక శ్రద్ధ బాధ్యత తీసుకోవడం ద్వారానే మండవల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జిల్లాలో తృతీయ స్థానం సాధించిందన్నారు. విద్యలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకొని వెనకబడిన సబ్జెక్టులపై అర్థమయ్యే రీతిలో ప్రత్యేక తరగతులు నిర్వహించి విద్యా బోధన చేయడంతోపాటు ఎప్పటికప్పుడు విద్యార్థుల తల్లిదండ్రులతో సంభాషిస్తూ వారిని కూడా ప్రేరేపించడంతో ఇంతటి ఘనత సాధించగలిగామన్నారు. 2022- 2023 విద్యా సంవత్సరం ఏప్రిల్‌లో నిర్వహించిన పదో తరగతి పరీక్షల్లో 135 మంది విద్యార్థులు హాజరవ్వగా వారిలో 67 మంది విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించాగలిగారరన్నారు. ఈ ఘనతకు పేరెంట్స్ కమిటీ సభ్యులు సహకారంతోపాటు సిఆర్‌పి విద్యాబోధనేతర సిబ్బంది సహాయ సహకారాలతో పాటు తల్లిదండ్రుల ప్రోత్సాహం ఎంతగానో ఉన్నాయని తెలిపారు. 2023- 2024 సంవత్సరంలో మరింత నూతన ఉత్సాహంతో పాఠశాలలోని విద్యార్థులకు విద్యాబోధన చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ఈ సంవత్సరం నూతనంగా ప్రయోగశాలలు వస్తున్నాయని, ప్రయోగశాలలను అందిపుచ్చుకుని అన్ని సబ్జెక్టుల్లో క్షుణ్ణంగా మరింత విద్యాబుద్ధులు నేర్పించి మరింత మంచి ఫలితాలను సాధించడానికి మరింత కృషి చేస్తామని ఆయన తెలిపారు.

పెట్రోల్ బంకు యాజమాన్యంపై చర్యలు కోరుతూ వినతి

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

హైవే రోడ్డు ఆక్రమించి ప్రమాదాలకు కారణం అవుతున్న ద్రాక్షాయణి పెట్రోల్ బంక్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని సిపిఎం మండల కమిటీ సభ్యులు జి.సూర్యకిరణ్ డిమాండ్ చేశారు. స్థానిక ఆర్‌డిఒ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ద్రాక్షాయణి పెట్రోల్ బంక్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా జి.సూర్యకిరణ్ మాట్లడుతూ శ్రీనివాసపురం బైపాస్ జంక్షన్ వద్ద ద్రాక్షాయని పెట్రోల్ బంకు నిర్వాహకులు ఇరువైపులా రహదారి మార్జిన్ ఆక్రమించారని తెలిపారు. ప్రభుత్వ నిబంధనలు ప్రకారం శ్రీనివాసపురం గ్రామానికి వెళ్లే రోడ్డుకు ముఖద్వారం కలిగి ఉండడానికి మాత్రమే అనుమతులు పొందిన పెట్రోల్ బంకు నిర్వాహకులు ప్రభుత్వ నిబంధనలు అతిక్రమించి హైవే రోడ్డుకు రాకపోకల కోసం మార్గం ఏర్పాటు చేసుకున్నారని తెలిపారు. ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కి అధికారులను తప్పుదోవ పట్టిస్తున్న పెట్రోల్ బంక్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని, బంకును సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. ఇటీవల ఈ పెట్రోల్ బంక్ ఆక్రమణల వల్ల పలువురు ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురయ్యారన్నారు. ఉన్నతాధికారులు దృష్టి సారించి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



స్పందన కార్యక్రమంలో వినతిపత్రం అందిస్తున్న సిపిఎం నాయకులు

బాల్య వివాహం చేస్తున్నారు..

దిశాకు బాలిక ఫోన్

స్పందించిన పోలీసులు

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

తనకు మైనార్టీ తీరలేదని, చదువుకునేందుకు తన తల్లిదండ్రులు అవకాశం ఇవ్వకుండా వివాహం చేసేందుకు నిశ్చయించారని ఓ బాలిక దిశ పోలీసులను ఆశ్రయించింది. సంబంధిత వివరాలిలా ఉన్నాయి. కామవరపుకోట మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన శ్రీనివాసరావు, అనంతలక్ష్మి కూలి పనులకు వెళుతూ జీవనం సాగిస్తున్నారు. వారి 17 ఏళ్ల కుమార్తెకు వివాహం చేసేందుకు నిర్ణయించారు. ఈనెల ఎనిమిదో తేదీన పెళ్లి ముహుర్తాన్ని సైతం నిశ్చయించారు. కానీ బాలికకు పెళ్లి ఇష్టం లేదు. తాను ఇంకా చదువుకోవాలని ఉందని చెప్పినా ఇంట్లో పెద్దలు పట్టించుకోలేదు. ఈ పరిస్థితుల్లో బాలికకు దిశ యాప్ గుర్తుకు వచ్చింది. ఆదివారం ఉదయం 9.37 గంటలకు బాలిక తన సెల్‌ఫోన్‌లోని దిశ ఎస్ఒఎస్‌కు కాల్ చేసి తనకు న్యాయం చేయాలని కోరింది. తక్షణం స్పందించిన దిశ పోలీస్ స్టేషన్ సిబ్బంది సంబంధిత తడికలపూడి పోలీస్ స్టేషన్ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. పెట్రోలింగ్‌లో ఉన్న పోలీస్ సిబ్బంది పది నిమిషాల్లోనే బాలిక ఇంటికి వెళ్లారు. అనంతరం తడికలపూడి ఎస్ఐ వెంకన్నకు సమాచారం ఇవ్వడంతో ఆయన బాలిక ఇంటికి వెళ్లి తల్లిదండ్రులకు, బంధువులకు కౌన్సిలింగ్ ఇచ్చారు. బాలికకు వివాహం చేయకూడదని, పైగా ఆమెకు ఇష్టం లేకుండా చేయడం నేరమని చెప్పారు. దిశ యాప్‌తో తనకు న్యాయం జరిగిందని బాలిక ఎంతో ఆనందం వ్యక్తం చేసింది.

నేడు భీమడోలు మండలంలో స్వచ్ఛభారత్ మిషన్ బృందం పర్యటన

ప్రజాశక్తి - భీమడోలు

స్వచ్ఛ భారత్ మిషన్ కార్యక్రమ పనితీరు పరిశీలనకు ఈ నెల ఆరో తేదీన జిల్లాకు రానున్న స్వచ్ఛభారత్ మిషన్ జాయింట్ సెక్రెటరీ, డైరెక్టర్ జితేంద్ర శ్రీవాత్సవ వచ్చేస్తున్నారు. ఈ పర్యటనలో భాగంగా ఆయన మోడల్ పంచాయతీలుగా గుర్తించిన భీమడోలు, దుద్దేపూడి గ్రామాల్లో అమలవుతున్న స్వచ్ఛ భారత్ మిషన్ కార్యక్రమాలను పరిశీలిస్తారు. ఇదే క్రమంలో చెత్త నుండి సంపద తయారీ కేంద్రాల పనితీరు, పర్యావరణ పరిరక్షణ, గ్రామపంచాయతీకి అదనపు ఆదాయ వనరులుగా మారిన వాటి తీరు ఇతర అంశాలను ఆయన పరిశీలించనున్నారు.

బాధ్యతలు చేపడుతున్న ఎంపిడిఒ

బుట్టాయగూడెం ఎంపిడిఒగా వేణుగోపాల్ రెడ్డి

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

బుట్టాయగూడెం ఎంపిడిఒగా ఎస్.వేణుగోపాల్‌రెడ్డి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన గతంలో వేలేరుపాడు ఎంపిడిఒగా పనిచేసి ఇక్కడికి బదిలీపై వచ్చారు.

వడదెబ్బకు లారీ డ్రైవర్ దుర్మరణం

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

వడ దెబ్బకు లారీ డ్రైవర్ ప్రాణాలు కోల్పోయిన సంఘటన సోమవారం జరిగింది. సంబంధిత వివరాలిలా ఉన్నాయి. కడపకు చెందిన లారీ డ్రైవర్ మార్తాల గురివిరెడ్డి (54) కడప నుంచి రాజమండ్రి - వైపు లారీలో ఇనుము లోడుతో వెళుతున్నాడు. మార్గమధ్యలో భీమడోలు సుగర్ ఫ్యాక్టరీ దగ్గరకు రాగానే వడదెబ్బకు గురయ్యాడు. గురివిరెడ్డి స్టీరింగ్ నియంత్రించలేక డివైడర్‌ను ఎక్కించేశాడు. ఆ తరువాత లారీ ఆగిపోయింది. పెట్రోలింగ్ పోలీసులు అతన్ని గమనించి వెంటనే ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అప్పటికే అతను మృతిచెందాడని నిర్ధారించారు. వడదెబ్బ వల్ల మరణించాడని వైద్యులు నిర్ధారించారు. దీంతో మృతదేహాన్ని కడప నుంచి వచ్చిన కుటుంబ సభ్యులకు అప్పగించారు.

చెరువుల అక్రమ తవ్వకాలు ఆపాలని ధర్నా

ప్రజాశక్తి - కలిదిండి

తహశీల్దార్‌కు వినతిని అందిస్తున్న నాయకులు

తాగునీటి చెరువును ఆనుకుని అక్రమంగా తవ్వుతున్న చేపల చెరువులను వెంటనే నిలుపుదల చేయాలని వ్యవసాయ కార్మిక, రైతు సంఘాల ఆధ్వర్యంలో స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట గ్రామస్తులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా అధ్యక్షులు నిమ్మగడ్డ నరసింహ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి శేషపు మహంకాళిరావు మాట్లాడుతూ మండలంలోని ఎస్‌ఆర్‌పి అగ్రహారంలో తాగునీటి చెరువును ఆనుకుని చేపల చెరువులు తవ్వుతున్నారన్నారు. దీంతో చెరువు పూర్తిగా కాలుష్యంబారిన పడుతుందన్నారు. భవిష్యత్తులో ప్రజలు రోగాల బారిన పడతారని ఆందోళన వ్యక్తం చేశారు. ఎత్తి పోతల పథకం వల్ల తాగునీటి బావులన్నీ కలుషితమయ్యాయని, ఇప్పుడు చేపల చెరువుల తవ్వకం వల్ల తాగునీటి చెరువు పాడై తాగునీరు లేకుండా పోతుందని గ్రామస్తులు తెలిపారు. తవ్వకం పనులు నిలుపుదల చేయకుంటే ప్రజా సంఘాల ఆధ్వర్యంలో పెద్దఎత్తున పోరాటం చేస్తామన్నారు. అనంతరం తహశీల్దార్ తేజోమణికి వినతిపత్రం అందజేశారు. గూడవల్లి రాజశేఖర్, శ్రీనివాసరావు, పడమటి పాపారావు, వెంకటేశ్వరరావు, కట్టా శ్రీనివాసరావు, ఉయ్యూరు ఈశ్వర్, పామర్తి సూరిబాబు, కె.సత్యనారాయణ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఈశ్వరయ్య

యువత పోరాటాలకు సిద్ధంగా ఉండాలి

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

నిరుద్యోగ నిర్మూలనలో విఫలమైన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను గద్దె దించేందుకు పోరాటాలకు సిద్ధంగా ఉండాలని ఎఐవైఎఫ్ రాష్ట్ర మాజీ కార్యదర్శి, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఈశ్వరయ్య పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక రోటరీ క్లబ్ భవనంలో అఖిల భారత యువజన సమాఖ్య జిల్లా జనరల్ బాడీ సమావేశం కుంచె వసంతరావు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ఈశ్వరయ్య, ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు పరుచూరి రాజేంద్ర, సిపిఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ముందుగా ఎఐవైఎఫ్ జెండాను ఆవిష్కరించిన ఈశ్వరయ్య అనంతరం జరిగిన సమావేశంలో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి జెవి.రమణరాజు, కొయ్యలగూడెం మండల కార్యదర్శి జమ్మి శ్రీనివాసరావు, బుట్టాయగూడెం మండల కార్యదర్శి సోదెం వెంకటేశ్వరరావు, జిల్లా సమితి సభ్యులు సురేష్ పాల్గొన్నారు.

పెద్దవాగు కాలువలు అభివృద్ధి చేయాలని ధర్నా

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ధర్నా చేస్తున్న నాయకులు

పోలవరం ప్రాజెక్టు ముంపులేని గుమ్మడవల్లి పెదవాగు ప్రాజెక్టు కుడి, ఎడమ ప్రధాన కాలువలు అభివృద్ధి చేయాలని, మేడేపల్లి, రామవరం, గమ్ముగూడెం, దాచారం గ్రామపంచాయతీ గ్రామాల భూములకు సాగునీరు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సిపిఐఎంఎల్ ప్రజాపంథా జంగారెడ్డిగూడెం డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో డివిజన్ కార్యదర్శి ఎస్‌కె.గౌస్ మాట్లాడుతూ పెదవాగు ప్రాజెక్టుకు కుడి, ఎడమ ప్రధాన కాలువల్లో మట్టిపూడిక తీయక, గండ్లు పడి సాగునీరు వృథాగా పోతుందని, భూములకు సాగునీరు అందక వేసిన వరి, మొక్కజొన్న, మిర్చి తదితర పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్య పరిష్కరించాలని 2014లో ఈ మండలాలు ఆంధ్రాలో కలిసిన తరువాత గత చంద్రబాబు ప్రభుత్వంలోనూ, ప్రస్తుత వైసిపి ప్రభుత్వం లోనూ అధికారులకు, ఎంఎల్ఎలకు, ఐటిడిఎ పిఒ, జిల్లా కలెక్టర్లకు వినతిపత్రాలిచ్చినా సమస్య పరిష్కారం కాలేదన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు సిరికొండ రామారావు, జి.ముత్యాలరావు, వేలేరుపాడు మండల కార్యదర్శి సోయం చంద్రరావు, మండల నాయకులు కారం సత్యవతి, మేడేపల్లి ఎంపిటిసి కట్టం రాంబాబు, తుర్రం తమ్మయ్య, కట్టం వీరాస్వామి, ఆశి లక్ష్మయ్య, మోసం రాజారావు, కుంజా రాజులు, పాయం బజారమ్మ పాల్గొన్నారు.

రైలు ప్రమాద మృతులకు సంతాపంగా కొవ్వొత్తుల ర్యాలీ

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఒడిశాలో రైలు ప్రమాద మృతులకు శ్రద్ధాంజలి ఘటిస్తూ సోమవారం రెడ్‌క్రాస్ వాలంటీర్లు ఏలూరులోని ఫైర్ స్టేషన్ సెంటర్ వద్ద కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా రెడ్ క్రాస్ ఛైర్మన్ బివి.కృష్ణారెడ్డి మాట్లాడుతూ రైలు ప్రమాద ఘటన ప్రపంచ దేశాలను కలచివేసిందని, సుమారు 300 మంది వరకూ ప్రాణాలు కోల్పోవడం, రెండు వేల మంది గాయాల పాలవడం బాధా కరమన్నారు. ఈ ప్రమాద ఘటన గురించి తెలియగానే ఎపి రెడ్‌క్రాస్ సొసైటీ శ్రీకాకుళం, విజయ నగరం, విశాఖపట్నం జిల్లాల రెడ్ క్రాస్ వాలంటీర్లను అప్రమత్తం చేసి, విపత్తుల నిర్వహణ, ప్రథమ చికిత్సలో శిక్షణ పొందిన వాలంటీర్లను పంపి సహాయక చర్యలు చేపట్టామని, రెడ్ క్రాస్ అంబులెన్సుల్లో క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించడం, ఆహారం, పాలు పంపిణీ చేయడం వంటి సహాయక కార్యక్రమాలు చేశామని వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెడ్ క్రాస్ కార్యదర్శి బి.బెన్నీ, డాక్టర్ ఆర్‌ఎస్‌ఆర్‌కె.వరప్రసాదరావు, వాలంటీర్లు పాల్గొన్నారు.

కొవ్వొత్తులతో సంతాపం తెలుపుతున్న రెడ్‌క్రాస్ వాలంటీర్లు

జీలుగుమిల్లి తహశీల్దార్‌గా సుందర్‌సింగ్

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

సుందర్‌సింగ్

జీలుగుమిల్లి తహశీల్దార్‌గా జి.సుందర్ సింగ్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ద్వారక తిరుమలలో విధులు నిర్వహిస్తూ ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా ఆయన జీలుగుమిల్లి తహశీల్దర్‌గా నియమితులయ్యారు. గతంలో ఇక్కడ పని చేసిన తహశీల్దార్ జి.ఎలీషా సస్పెండ్ కావడంతో అప్పటి నుంచి డిప్యూటీ తహశీల్దార్ సందీప్‌కు ఇన్‌ఛార్జిగా బాధ్యతలు అప్పగించారు. ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో భాగంగా సుందర్ సింగ్‌ను నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతాల్లో ఉన్న సమస్యల పట్ల ప్రతేక దృష్టి సారించనున్నట్లు తెలిపారు.

ఎంపిడిఒగా కృష్ణప్రసాద్

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

కృష్ణప్రసాద్

జీలుగుమిల్లి ఎంపిడిఒగా కెఆర్‌ఎస్.కృష్ణప్రసాద్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. కొయ్యలగూడెంలో కొన్ని నెలలుగా విధులు నిర్వహిస్తూ సాధారణ బదిలీల్లో భాగంగా జీలుగుమిల్లికి బదిలీపై వచ్చినట్లు ఆయన తెలిపారు. గతంలో సుపరింటెండెంట్‌గా పని చేసిన మంగతాయారు ఎంపిడిఒగా విధులు నిర్వహిస్తుండగా ఇప్పటినుంచి కృష్ణ ప్రసాద్ బాధ్యతలు స్వీకరించనునట్లు తెలిపారు. మండలంలో ఉన్న సమస్యలపై ప్రత్యేక దృష్టి సారిస్తనని చెప్పారు.

సేవా సంస్థకు బియ్యం వితరణ

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

స్థానిక సీతామహాలక్ష్మి స్వచ్ఛంద సేవా సంస్థకు కాంగ్రెస్ నేతలు బియ్యం, స్వీట్స్, పండ్లు అందించారు. సోమవారం కాంగ్రెస్ పార్టీ పిసిసి డెలిగేట్, ఏలూరు జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షులు శీలం కృష్ణంరాజు పుట్టినరోజు సందర్భంగా సేవా సంస్థ నిర్వాహకులు జయవరపు శేఖర్‌కు నిత్యావసరాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుట్టినరోజు వేడుకలను సేవాకార్యక్రమాలతో చేపట్టడం అనాథలకు సాయం చేయాలనే ఆలోచన అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో మద్దిపట్ల శ్రీనివాసరావు, వీరవల్లి సోమేశ్వరరావు, రొక్కం ఆది, మొగిలినేడి శ్యామ్, సతీష్ పాల్గొన్నారు.

కుల ధ్రువీకరణ పత్రాల మంజూరు కోరుతూ ధర్నా

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

గతంలో వలే తమ సామాజిక తరగతులందరికీ షెడ్యూలు తెగల కుల ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేసి తమకు ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలని చింతలపూడి నియోజకవర్గం కామవరపుకోట మండలం కెకోట పంచాయతీకి చెందిన నాయక్ కులస్తులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఏలూరు కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించిన ఎస్.కోట గ్రామస్తులు మాట్లాడుతూ గతంలో ప్రభుత్వ ఉత్తర్వులు అనుసరించి తమ కులస్తులకు షెడ్యూలు తెగల ధ్రువీకరణ పత్రాలు ఇచ్చేవారని, కాని కొన్ని సంవత్సరాలుగా కుల ధ్రువీకరణ పత్రాలు ఇవ్వకపోవడంతో పిల్లల చదువులతో పాటు సామాజిక పెన్షన్, వృద్ధాప్య పెన్షన్, ఇతర నవరత్న పథకాలకు తమ కులస్తులు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకొని తమ కులస్తులకు షెడ్యూలు తెగల సర్టిఫికెట్ ఇప్పించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో నల్లమోతుల నాగమణి, మేనుగుల అనిత, సవళ్ల దుర్గమ్మ, గోధుమ భారతి, వెంకటేశ్వరరావు, సత్యనారాయణ, శ్రీను, సత్యప్రసాద్ తదితర నాయక్ కులస్తులు పాల్గొన్నారు.

పాస్‌పోర్టు పోయినది

పశ్చిమ గోదావరి జిల్లా, కాళ్ళ మండలం, వేంపాడు గ్రామం కాపురస్తులు కొండేటి వెంకటేశ్వరరావు గారి కుమారుడు కొండేటి రాజేష్ అను నా యొక్క పాస్‌పోరును జిరాక్సు నిమిత్తం కాళ్ళ మోటారు సైకిల్‌పై వెళ్ళు తుండగా మార్గమధ్యలో పడిపోయినది. నా యొక్క **పాస్‌పోర్టు నెం. S9267516.** ఎవరికైనా దొరికిన ఎడల ఈ క్రింది అడ్రసుకు అందజేయగలరు.

కొండేటి రాజేష్
తండ్రి: వెంకటేశ్వరరావు, వేంపాడు గ్రామం,
కాళ్ళ మండలం, ప॥గో॥జిల్లా.
సెల్: 91217 16702

డాక్యుమెంట్స్ పోయినవి

నా పేరు పెనుమత్స నాగలక్ష్మి, భర్త: B.S.V.S.N. రాజు అను నేను మా బంధువులైన గణపవరం గ్రామంలో పెళ్లికి వెళ్ళాము అక్కడనుండి పిప్పర గ్రామంలో మా బంధువులు ఇంటికి మోటార్ సైకిల్ పై వెళ్తుండగా నాకు సంబంధించి విశాఖపట్నం జిల్లా, చిన్నగదిల మండలం అడవివరం గ్రామంలో డాక్యుమెంట్ నెంబర్ 2968/1993 సంబంధించిన డాక్యుమెంటు మరియు బెంగుళూరు రూరల్ నేలమంగళ తాలూకా అరలసంద్ర మరియు గోవిందపురే అను గ్రామాల్లో సంబంధించిన డాక్యుమెంట్ నెంబర్ I7686/2004 to 2005 అను రెండు డాక్యుమెంట్లు ఉన్న బ్యాగు మార్గ మధ్యలో పడిపోయినది కావున దొరికిన వారు కింద ఫోన్ నెంబర్‌కు తెలియజేయవలెను.

పెనుమత్స నాగలక్ష్మి
భర్త: P.B.S.V.S.N. రాజు,
గణపవరం.
సెల్: 94401 33333